క్లుప్తంగా

అక్రమ కేసులకు భయపడం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొమ్మనహాళ్: 'వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించినా భయపడేది లేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డీతో సహా చెల్లిస్తాం' అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు అన్నారు. బుధవారం బొమ్మనహాళ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయడంపై ఉన్న ఆసక్తి హామీల అమల్లో లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చేసే అరాచకాలను సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించిన వారిపై కక్షసాధింపులకు పాల్పడుతోందని మండిపడ్డారు. అక్రమంగా కేసులు పెట్టి తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు లోకేష్, ఎంసీహెచ్ రాజ్‌కుమార్, పయ్యావుల సత్యన్న, పరమేశ్వర, వెంకటరెడ్డి, దేవరెడ్డి, ఆంజినేయులు, తిరుమలరెడ్డి, జగన్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 7వ వార్డు సత్యనారాయణస్వామి గుడి ఏరియాలో నాలుగు చోట్ల సీసీ రోడ్ల నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప బుధవారం భూమి చేశారు. ఆమెతో పాటు మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ శివపుత్ర, మున్సిపల్ డీఈ రవిప్రకాష్‌నాయుడు, ఏఈలు ప్రతాప్, నరసింహులు, పాల్గొన్నారు. మున్సిపల్ సాధారణ నిధులు రూ.13.30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రశాంతి, కోఆప్షన్ సభ్యుడు నజీర్, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పొరాళ్ల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ స్వచ్ఛతకు కృషి

పట్టణ స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పిలుపునిచ్చారు. పాత మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న గదిలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) సెంటర్‌ను బుధవారం పరిశీలించారు. పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు, కాగితాలు, బట్టలు, పేపర్లు, ఇతరాత్ర వస్తువులను ప్రజలు ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లో అందజేయాలన్నారు.

స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ



సెపక్‌తక్రా స్పోర్ట్స్ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక పటేల్ ఇండోర్ స్టేడియంలో జిల్లాలోని 12 సెపక్‌తక్రా క్లబ్‌లకు బుధవారం స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ చేశారు. జిల్లా సెపక్‌తక్రా క్రీడా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సెపక్‌తక్రా సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఈ ఏడాది నిర్వహించే క్రీడా పోటీల వివరాలతో పాటు గత ఏడాది సెపక్‌తక్రాలో విద్యార్థులు సాధించిన విజయాలను వెల్లడించారు. జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో ఇండోర్ స్టేడియం అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌వీఎస్ చౌదరి, ఉపాధ్యక్షుడు నగ్రాకేశన్న, సెపక్‌తక్రా జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు షాహిన్, జిల్లాలోని వివిధ పాఠశాలల పీడీలు మారుతి ప్రసాద్, మంజునాథ్, ప్రభాకర్, రాజేష్, హలీమా, కృష్ణ, శ్యామల, రుద్ర, అనిత్, నాగేంద్ర, ఎర్రిస్వామి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే 'ప్రజాదర్బార్'



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కణేకల్లు: ప్రజాసమస్యల పరిష్కారం కోసమే 'ప్రజాదర్బార్' నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం 'ప్రజాదర్బార్' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించి సమస్యలను తక్షణమే పరిష్కారించాలని అధికారులకు ఆదేశించారు. సమస్యాత్మకమైన సమస్యలను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించి పరిష్కరించాలన్నారు. డీఎల్‌డీఓ నాగేశ్వర్‌రావు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతన వెతలు

'విడపనకల్లు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉపాధి కూలీలు ధర్నా చేస్తున్న దృశ్యం ఇది. ఉపాధి బిల్లులు చెల్లించకపోవడంతో కడుపుమండిన కూలీలు ఇలా కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. విడపనకల్లు మండలంలో 18 వేల జాబ్‌కార్డులు ఉండగా.. ఇక్కడ 32 వేల మంది కూలీలు ఉన్నారు. వ్యవసాయ పనులు ఏవీ లేకపోవడంతో పెద్ద సంఖ్యలో ఉపాధి పనులకు వెళుతున్నారు. అయినా కూలీలకు డబ్బులు అందకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.'



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కూలీలు

- మూడు నెలలుగా అందని వేతనాలు
- పస్తులుండాల్సిన దుస్థితి
- పట్టించుకోని అధికారులు



ఉరవకొండ సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఉరవకొండ: సుర్రుమంటున్న ఎండల్లో చేతులకు బొబ్బులు వచ్చేలా కాయకష్టం చేసిన ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు అందడం లేదు. మూడు నెలలుగా ఉపాధి బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎర్రని ఎండలో తాము పనులు చేసినా.. కూలీ డబ్బు జమ చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి ఆరంభం నుండే ఎండలు తీవ్ర స్థాయిలో ప్రతాపం చూపుతున్నాయి. కూలీలకు సరైన వసతుల కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 43.67 లక్షల పని రోజులుగా నిర్దేశించారు. ఫిబ్రవరి నెల నుంచి మార్చి, ఏప్రిల్ నెల కూలీలకు రూ.15.20 కోట్లు అందాల్సి ఉంది. ఒక్క ఉరవకొండ నియోజకవర్గంలోనే ఉపాధి హామీ కూలీలకు ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకూ రూ.3.50 కోట్ల బకాయిలు ఉన్నాయి. నియోజకవర్గంలో 81 వేల జాబ్‌కార్డులు ఉండగా.. 2,43,000 మంది కూలీలు ఉన్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో కూలీల వివరాలు

2024-25 ఉపాధి పనిదినాలు	43.67 లక్షలు
యాక్టివ్ జాబ్‌కార్డులు	1,18,203
యాక్టివ్ కూలీలు	1,97,197
చెల్లించాల్సిన బకాయి	రూ.15.20 కోట్లు

బకాయిలు చెల్లించాలి

మా కుటుంబంలోని నలుగురు వ్యక్తులు కూలీ పనులకు వెళ్తున్నాం. 10 వారాలు పని చేసినా బిల్లులు అందలేదు. అధికారులను అడిగినా స్పందించడం లేదు. ఉపాధి బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో అవస్థలు పడుతున్నాం. కుటుంబ పోషణ భారంగా మారింది. అప్పు చేసి నిత్యావసరాలు తెచ్చుకుంటున్నాం. బిల్లులు సకాలంలో చెల్లిస్తే ఇబ్బంది ఉండదు. ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. – మునెప్ప, విడపనకల్లు

ఎలా బతకాలి ?

ఉపాధి పనులు చేసి 3 నెలలు అవుతోంది. పని చేసిన కూలీ ఇవ్వకుండా రోజూ ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటున్నారు. ఉద్యోగులకు నెల నెల జీతాలు ఇవ్వకపోతే ఊరుకుంటారా? మా కూలీ సొమ్ము నెలల తరబడి ఇవ్వకపోతే మేం ఏం తినాలి. ఎలా బతకాలి చెప్పండి? వెంటనే బకాయి బిల్లులు చెల్లించాలి. – నాగమ్మ, ఉరవకొండ

త్వరలో జమ చేస్తాం

కూలీలకు ఫిబ్రవరి నుంచి ఉపాధి బిల్లులు చెల్లించాల్సి ఉంది. బడ్జెట్ విడుదల కాగానే కూలీల ఖాతాలకు బిల్లులు జమ చేస్తాం. కూలీలు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరికి బకాయి బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటాం. – రవిప్రసాద్, ఎంపీడీఓ, ఉరవకొండ

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి

శెట్టూరు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు మంజునాథ, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప హాజరయ్యారు. సమస్యలను పలుమార్లు సభ దృష్టికి తీసుకొచ్చినా పరిష్కారం కావడం లేదంటూ సభ్యులు మండిపడ్డారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, రహదారుల నిర్మాణానికి సంబంధించి సభ్యులు అధికారులను ప్రశ్నించారు. ములకలేడు ఆరోగ్య ఉపకేంద్రం శిథిలావస్థలో ఉందని, తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు లింగప్ప కోరారు. మండల వ్యాప్తంగా శ్రీరామరెడ్డి తాగునీటి సమస్య నెలకొందని ఎంపీటీసీ నరసింహులు తెలియజేశారు. ఉపాధి హామీ బిల్లులు రూ.3 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాలని సభ్యులు కోరారు. బొగ్గుల బట్టీలతో కాలుష్యం పెరుగుతోందని, వాటి అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వెలుగు కార్యాలయంలో అంబేద్కర్ జయంతిని నిర్వహించకపోవడంపై సర్పంచ్ కుమార్, ఎంపీటీసీ లింగప్ప ఏపీఎం గంగన్నను నిలదీశారు. అంబేద్కర్ జయంతి నిర్వహించాల్సిన అవసరం తనకు లేదని ఏపీఎం పేర్కొనడంతో సభ్యులు ముక్తకంఠంతో ఖండించారు. ఎంపీడీఓ రఘురామరావు, తహశీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఎంపీటీసీలు గీతమ్మ, నాగమణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేంద్రప్రసాద్, డాక్టర్ తరుణ్ సాయి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వడ్డీతో పంట రుణాలు రెన్యూవల్ చేయాలి



ములకలేడులోని యూనియన్ బ్యాంక్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

శెట్టూరు: వడ్డీ మాత్రమే కట్టించుకుని పంట రుణాలు రెన్యూవల్ చేయాలి రైతులు డిమాండ్ చేశారు. బుధవారం రైతులు ములకలేడులోని యూనియన్ బ్యాంకుకు తాళం వేసి ధర్నా చేపట్టారు. వీరికి వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు మద్దతు ప్రకటించారు. గత ప్రభుత్వంలో వడ్డీతో మాత్రమే క్రాప్ లోన్స్ రెన్యూవల్ చేసుకున్నట్లు రైతులు గుర్తు చేశారు. కరువు పరిస్థితుల్లో అసలు, వడ్డీ కలిపి రెన్యూవల్ చేసుకునే పరిస్థితుల్లో లేమన్నారు. రుణాల రెన్యూవల్‌కు సహకరిస్తామని బ్యాంకు చీఫ్ మేనేజర్లు శివప్రసాద్, లక్ష్మీప్రసాద్ హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించారు. స్థానిన సర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీ లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

హనుమద్ వాహనంపై వేంకటేశ్వరుడి వైభవం



స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండల కేంద్రంలో జనార్దన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం హనుమద్ వాహనంపై స్వామి భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అంగదాల క్రిష్ణయ్య, ఆలయ ప్రధాన అర్చకుడు నరసింహ మూర్తి పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం పల్లకీ సేవ, రాత్రి స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ అంగదాల క్రిష్ణయ్య తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ నాగేశ్వరరావు, సిబ్బంది



గ్యాస్ ప్రమాదాలపై డెమో నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కళ్యాణదుర్గం రూరల్: అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ స్టేషన్ ఆఫీసర్ వసంత్ నాయక్ మాట్లాడుతూ అగ్నిమాపక ప్రమాదాలు ఎక్కువగా వంట ఇంట్లో జరుగుతాయని, వంటగదుల్లో గాలి వెలుతురు ఉండేటట్టు చూసుకోవాలన్నారు. విద్యుత్ పరికరాలతో జరిగే ప్రమాదాలపై ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అనంతరం అగ్ని మాపక పరికరాలతో మాక్ డ్రిల్ చేపట్టారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ కే శ్రీధర్, రవిశంకర్, అధ్యాపకులు, ఫైర్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణే లక్ష్యం

రాయదుర్గంటౌన్: అగ్నిప్రమాదాల నివారణే అగ్నిమాపకశాఖ లక్ష్యమని రాయదుర్గం ఫైర్ ఆఫీసర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని కణేకల్లు రోడ్డు దత్త రెసిడెన్సీ ఏరియాలో ప్రమాదాల నివారణ, ఇతరాత్ర జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్‌లు మల్లారెడ్డి, యుగంధర్, రంజిత్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ఉరవకొండ: గ్యాస్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఉరవకొండ అగ్నిమాపక శాఖ అధికారి భీమలింగ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలో గ్యాస్ ప్రమాదాలు, ఎలక్ట్రికల్ అగ్ని ప్రమాదాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. గ్యాస్ సిలిండర్‌లో మంటలు చెలరేగినపుడు ఎలా ఆర్పాలో డెమో ద్వారా చేసి చూపించారు. అనంతరం ప్రజలకు గ్యాస్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలి



ఏఓ ఈశ్వరమ్మకు వినతిపత్రం ఇస్తున్న ముస్లింలు

కళ్యాణదుర్గం రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని ముస్లింలు డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం వారు పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని ఏఓ ఈశ్వరమ్మకు వినతిపత్రం అందజేశారు. ముస్లిం మత పెద్దలు బాషా, ఇబ్రహీం సాబ్, కంబదూరు రఫీ, అఫ్జల్, అబ్దుల్‌రేషమాన్ షేక్షావలి, సామీర్, శర్మస్, బాబా, దాదాఫీర్, ఇబ్రహీం, అబీబ్, ముజీబ్, కంబదూరు ఆలీ, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.



యూనిఫాంతో స్కౌట్ విద్యార్థులు

స్కౌట్ యూనిఫాం అందజేత

కుందుర్పి: ఎనుములదొడ్డి ఉన్నత పాఠశాల స్కౌట్ విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన యూనియన్ బ్యాంక్ ఉద్యోగి లోకేష్ యూనిఫాం ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా బ్యాంక్ ఉద్యోగి లోకేష్, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి బొమ్మయ్య తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. స్థానిక సర్పంచ్ విజయ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనరసప్ప, స్కౌట్ మాస్టర్ లక్ష్మన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బస్సు కిందపడిన బైక్

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

బ్రహ్మసముద్రం: ముప్పలకుంట సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆర్టీసీ బస్సు బైక్ ఢీ కొంది. వివరాలు.. కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో బస్సు వేపులపర్తికి బయలుదేరింది. ముప్పలకుంట– కళ్యాణదుర్గం మధ్యమార్గంలో అటవీ ప్రాంతంలో మలుపు వద్ద ముప్పలకుంటకు చెందిన హర్షవర్ధన్ అనే యువకుడు బైక్‌పై వెళ్తుండగా ఢీకొంది. ఘటనలో బైక్ బస్సు కిందపడి నుజ్జునుజ్జయింది. హర్షవర్ధన్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

ట్రా 'ఫికర్'

- బళ్లారి రోడ్డులో నిత్యం ట్రాఫిక్‌జామ్
- ఇబ్బందుల్లో వాహనదారులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డులో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ మార్గంలో వాహనదారులు, పాదాచారులు రాకపోకలకు సాగించేందుకు బెంబేలెత్తుతున్నారు. నిత్యం వాహనాల పెద్ద సంఖ్యలో నిలుస్తుండటంతో సమస్యగా మారుతోంది. వినాయక సర్కిల్ నుంచి బొడ్డురాయి వరకూ ట్రాఫిక్ ఉంటుంది. ముఖ్యంగా వినాయక సర్కిల్ నుంచి బళ్లారి బస్టాప్, వన్నూరుస్వామి కట్ట వరకూ ఈ సమస్య అధికంగా ఉంది. రోడ్డు విస్తరణ జరగకపోవడం, రోడ్డు మార్జిన్‌కు అనుకుని వ్యాపారాలు, అంగళ్లు, వాహనాల పార్కింగ్, ప్యాసింజర్ ఆటోల పార్కింగ్‌లతో ట్రాఫిక్ సమస్య తారాస్థాయికి చేరింది. అలాగే బళ్లారికి వెళ్లే ప్రైవేటు, ఆర్టీసీ బస్సులన్నీ అరబిక్ కళాశాల వద్ద నిలుపుతుండడంతో ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. బళ్లారి నుంచి బస్సులన్నీ వినాయక సర్కిల్ వద్ద ఆపి ప్రయాణికులను దింపుతుండడంతో రాకపోకలకు స్తంభిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పోలీసులు స్పందించి బళ్లారి రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేశారు.



వాహనాల రాకపోకలతో స్తంభించిన రాయదుర్గంలోని బళ్లారి రోడ్డు

ప్రజా సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ మారుతమ్మ

కళ్యాణదుర్గం రూరల్: ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ మారుతమ్మ అధికారులను కోరారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ, ఎంపీడీఓ రామచంద్ర మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రజాప్రతినిధులతో కలిసి స్థానిక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రజాప్రతినిధులు తెలియజేసే సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు. వైస్ ఎంపీపీ కాంతమ్మ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో బహుజన సమాజ్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాసాని నాగరాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు.

నేడు మండల మీట్

బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండలాధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డులోని జామియా మహమ్మదీయ అరబిక్ కళాశాల వద్ద బుధవారం ముస్లిం మైనారిటీ యువత ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. మొదటి రోజు చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ సైఫుల్లా, మత గురువులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు మల్లికార్జున, వీరన్న మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వివేకానంద, సర్పంచ్ ముక్కన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాతిదూలం పోటీలు

కణేకల్లు: చిక్కణ్ణేశ్వరస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జెడ్పీహైస్కూల్ క్రీడామైదానంలో గురువారం దున్నపోతుల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. ఉదయం 7.30 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు ఈ పోటీల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

వినియోగదారుల నుంచి 27 ఫిర్యాదులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ఆవరణంలో బుధవారం వినియోగదారుల సేవా శిబిరం నిర్వహించారు. మేనేజర్ హరికృష్ణ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన శిబిరంలో 27 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు.

'దుర్గం'లో మోస్తరు వర్షం

రాయదుర్గంటౌన్: పట్టణంలో బుధవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. రాత్రి 7.45 గంటల నుంచి అరగంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలకు వర్షంతో కాస్త ఉపశమనం లభించింది.

మృతుడి కుటుంబానికి పరామర్శ



వెంకి (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని 12వ వార్డు ఎర్రనేల వీధి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పూజారి వెంకి(36) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ పట్టణ కన్వీనర్ సుధీర్, మండల మాజీ కన్వీనర్ తిరుమల వెంకటేశులు తదితరులు వెంకి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. నాయకులు పూజారి మంజు, అబీబ్ తదితరులు పాల్గొన్నారు.